# గొలుసు కథ-9 [illegible] ప్రణాళి

పోలీసులు ఎంత గాలించినా, ఇన్‌కంటాక్సు ఆఫీసులో గానీ, కవరుమీద రాసిన అడ్రసులో గానీ, డి.సి.టి.ఓ.గారి ఇంటి పక్కనున్న కాలేజీ అమ్మాయి చెప్పిన గుర్తులు గల 'ష్టరుగు' ఆసామీ దొరకలేదు. ఎలాగైనా అతగాడ్ని పట్టుకుని, పోలీసు కమిషనర్ భాస్కర్ మెప్పులు పొందాలని ఆ ఏరియా పోలీసు బృందం తీవ్రమైన కృషి చేస్తోంది.

పేపర్లో వేశారు డి.సి.టి.ఓ.గారింట్లో జరిగిన విచిత్రి చోరీని గురించి. అది చదివి, ఐ.జి. ఫోన్ చేసి, భాస్కర్‌ని హెచ్చరించాడు.

ఆ రాత్రి ముద్దమింగుడు పడలేదు భాస్కర్‌కి. భార్య పసికట్టింది. నిలదీసింది. తప్పనిసరై చివరికి ష్టరుగు వ్రాసిన ఉత్తరం చూపాడు.

దైవసమానులైన,

కమీషనరుగార్కి, శతకోటి నామాభివందనములు! లోగడ నేను ఏడుకొండలవాడికి గొప్ప భక్తుడిని. నా బిజినెస్‌లో వాడికి పావలా వాటా వుంది. దొంగతనం విజయవంతంగా జరిగిన వెంటనే, వాడి వాటాని వాడి హుండీలో వేసేవాడిని! వాడు నన్ను కాపాడేవాడు! కానీ యీ మధ్య నన్ను మోసం చేసాడు. రెండుసార్లు నన్ను పోలీసులు అరెస్టు వెయ్యబోయారు. అయితే, నా బుర్ర ఉపయోగించి, సమయానికి నా వద్దనున్న దొంగ సరుకును దూరం చేసి, బయట పడ్డాను. దాని వల్ల, నా కష్టం వృథా అయ్యింది. ఇక వాడికి వాటా యేమిచ్చేది?

కనుక, యిక మీదట నేను మిమ్మలను దైవంగా భావించి, నా పాత పద్ధతి ప్రకారం వాటా మీకివ్వదలిచాను. ఎక్కడ ఎప్పుడు ఎలా దొంగతనం చేసినా మీకు రావలసిన సొమ్ము పైసలతో సహా మీకు ముట్టచెప్పగలను! నన్ను కాపాడవలసిన బాధ్యత మీది!

నిన్న జరిగిన బిజినెస్‌లో, మీ వాటా మొత్తం లక్షా పదివేల, పది రూపాయలు డి.డి.గా మీకు రిజిష్టర్డ్ పోస్టులో పంపుతున్నాను. నా మీద ఈగ వాలకూడదు! శలవు!

ఇట్లు
మీ భక్తుడు
ష్టరుగు

హైదరాబాద్,
22-11-1985

ఉత్తరం చదివి విస్తుపోయింది భాస్కర్ భార్య శ్యామల! "డి.డి. బ్యాంకులో వేశారా?" అడిగింది.

"డి.డి.ని బ్యాంకులో వేస్తే, నే వుండేది యిక్కడ కాదు! జైల్లో! ఆ బ్యాంకులో డి.డి. రిక్విజిషన్ ఫాం వెరిఫై చేయించాను. దాంట్లో కూడా ఈ కవరు మీద రాసిన తప్పుడు అడ్రసే వుంది! ఈ సంగతి యెవ్వరికీ చెప్పలేదు. ఏం చెయ్యాలో తెలీడం లేదు! నా బుర్రేమో పని చెయ్యడం లేదు!" కళ్ళు మూసుకొని, కుర్చీలో వెనక్కు వాలాడు.

** ** **

ఐ.జి.కి. ష్టరుగు వుత్తరం, డి.డి.ని చూపాడు భాస్కర్. ఆయన చకితుడయ్యాడు.

"ఇంత తెలివిగలవాడివి, ధైర్యవంతుడివి, ఎలాగైనా నేనొక్కసారి చూడాలి, భాస్కర్! నా కోసమైనా వాడిని పట్టుకోవాలి!" అర్థించాడు.

"అలాగే సార్! ఇటీజ్ మై డ్యూటీ!" భాస్కర్ పట్టుపట్టాడు.

పోలీసులు రౌడీలను, దొంగలను పట్టుకొచ్చి, చితక తన్నుతున్నారు. కానీ, అసలు దొంగ బయటపడలేదు.

** ** **

రామకృష్ణ మరోసారి అందరికీ రాబోయే ఆదివారం తమ యింట్లో భోజనాల మాట గుర్తు చేశాడు.


భాస్కర్ యేదో సాకు చెప్పి, తప్పించుకోవాలనుకున్నాడు. కానీ, తల్లి, భార్య ఒప్పుకోలేదు. తప్పనిసరై ఆదివారం భోజనాలకు బయల్దేరారు.

అందరినీ సాదరంగా ఆహ్వానించి, చల్లటి పానీయాలందించాడు రామకృష్ణ.

హోటల్లో అడిగినట్లు, 'మీకేం కావాలి'- 'మీకేం యిష్టం' అంటూ అందరినీ అడిగి, కాయితం మీద రాసుకున్నాడు.

భాస్కర్ భార్య, తల్లి, వెంకోజీ శ్రీమతి, శర్మ ధర్మపత్ని 'ఇంత శ్రమయెందుకని - ఇవన్నీ యెందుకని' ఎన్నెన్నో అన్నారు. కానీ, రామకృష్ణ వినలేదు. "ఎంత ఖర్చయినా సరే, ఎంత టైమయినా సరే, యివన్నీ యీ రోజు చెయ్యాలి! మనందరం ఆరగించాలి!" అని పట్టుపట్టాడు. అప్పటికే టైం పన్నెండు దాటింది. అంతా భయపడ్డారు. 'యెప్పటికి వంటలయ్యేను! యెప్పటికి తిని బయటపడేము!' అని.

"మనం అందరం అలా వంటగది వైపు ఒకసారి వెళ్ళొద్దాం పదండి! మీకు థ్రిల్లింగ్‌గా భోజనాలు



పెడతానన్నా కదా! రండి" అంటూ దారితీశాడు.

అంతా అతనిని అనుసరించారు.

"ఇదిగో మూశారా! మా ఆవిడ! జంధ్యాల జానకీ రామకృష్ణ! రెండ్రోజుల క్రితం బహిష్టులో వెళ్ళు కింద చేరి, వనవాసం చేస్తూంది." అన్నాడు. మాన్పడిపోయారంతా.

ఆమె లేచి నమస్కరించి, సిగ్గుతో తల పక్కకు తిప్పుకుంది.

"ఇవ్వాళ సెల్ఫ్ సర్వీసు! ఎవరికిష్టమైన వంట వారే చేసుకుని ఆనందంగా ఆరగించాలి! రండి రండి! ఆలస్యమౌతుంది!" వంటగదిలోకి ప్రవేశించాడు.

నీరసపడి, "ఇవాళకు హోటల్ భోజనం బావుం టుందేమోనండీ!" అంది శ్యామల.

"అమ్మమ్మమ్మా! థ్రిల్లు పోతుంది వదినగారూ! మీరు ప్రపోజల్ మార్చుకండి!" రామకృష్ణ అన్నాడు.

అంతా కోరికలు చంపుకుని, సింపుల్ భోజనం తయారు చేసి, మూడు గంటలకు, ముక్కుతూ, మూలుగుతూ భోజనాలయ్యాయనిపించారు.

"ఇది మా యిల్లు! నేను మీ వాడిని! ఇవి మీరు చేసిన వంటలు! కనుక, ఎలాంటి వంకలు పెట్టకూడదు!" రామకృష్ణ అన్నాడు.

"ఎంత మాటెంత మాట! వదినా వైపులో ఇక నోరు మెదపను!" భాస్కర్ చెంపలేసుకున్నంత పని చేశాడు. అంతా ఘొల్లున నవ్వారు.

"ఒరేయ్! రామకృష్ణా! నేను హైద్రాబాద్ వచ్చాక అనేక రకాల సంఘటనలు జరిగాయి. వాటిలో చాలా మరువలేనివి. అవన్నీ ఈ డైరీలో రాసుకుంటాను." అంటూ జేబులోనుంచి ఒక డైరీ తీసి చూపాడు.


"మీ అందరి ఇళ్ళ అడ్రస్సులు కావాలా. ఆఫీసుకు శెలవిచ్చిన రోజు మిమ్మల్ని కలవడానికి. రాయరా వెంకోజీ." అంటూ డైరీ ఇచ్చాడు.

వెంకోజీ డైరీలో తన అడ్రస్ వ్రాసిచ్చాడు. అది చూసి, "రేయ్! శర్మా! నువ్వు కూడా రాసి, రామకృష్ణ కివ్వు!" డైరీని తిరిగిచ్చాడు.

అంతా అడ్రస్‌లు రాశారు. ఒకసారి చూసి, గట్టిగా చదివాడు. 'ఓకే' అన్నారంతా.

"సరేరా! మాస్టారు ఊరినించి రాగానే మనం ప్రోగ్రాం ఏర్పాటు చేసుకుందాం! బై!" అంటూ భాస్కర్ కారుకేసి నడిచాడు. ఫామిలీ కారెక్కారు. కారు సాగింది.

భాస్కర్ బుర్ర వేడెక్కుతూంది. 'ఒక్కసారి తాను తెలివిగలవాడినని చెప్పకున్నందుకు, వీళ్ళెంత కక్ష సాధిస్తున్నారు?" గట్టిగా ఊపిరి పీల్చాడు.




పోలీసు జీపు వెంకోజీ ఇంటి ముందాగింది. ఎస్.ఐ. తలుపు కొట్టాడు. అప్పుడే ఆఫీసు నించి వచ్చి, కాఫీ తాగుతున్న వెంకోజీకి అరెస్టు వారెంటు చూపి, ఏమీ చెప్పకుండా, ఎంత చెప్పినా వినకుండా బయటికి నడిపించాడు. అతని భార్య శోకాలు పెట్టింది.

అలాగే శర్మ, రామకృష్ణలు వెంకోజీకి తోడుగా జీపులోకి తీసుకురాబడ్డారు.

ముగ్గుర్నీ ఖైదులో బంధించారు. కమీషనర్ భాస్కర్ తమ స్నేహితుడన్నా వినలేదు. అవన్నీ కోర్టులో చెప్పకోమన్నారు. అంతా అయోమయమై, అవమానంతో కుమిలిపోయారు మిత్రులు. ఎందుకీ శిక్ష...? *

—పైహారం